క్లుప్తంగా

13 నుంచి నాబార్డ్ ప్రో మేళా

తిరుపతి కల్చరల్: స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ వారి భాగస్వామ్యంతో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు తరంగ్ ప్రో మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు నాబార్డ్ డీడీ సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో గో ఆధారిత వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రీయ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కూరగాయలు, పండ్లు, మినుములు, తేనె, బెల్లం తదితర ఉత్పత్తులతో కూడిన 50 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. చీరలు, చేనేత, కలంకారి చీరలు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు తదితర చేనేత ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులను, కళాకారులను ప్రోత్సహించడం, వారి ఆదాయ మార్గాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మేళా ప్రదర్శన రోజులలో ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తిరుపతి ప్రజలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

14న శ్రీగోవిందరాజ స్వామి పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 14న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా చేపట్టనున్నారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి, సంపంగి, రోజా, కలువలు తదితర వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.

సాయినగర్ సర్పంచ్ ఇంటిపై రాళ్ల దాడి

– నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

తిరుపతి రూరల్: సాయినగర్ పంచాయతీ సర్పంచ్ డీపీ రమణ ఇంటిపై సోమవారం రాళ్ల దాడికి తెగబడ్డారు. శ్రీనివాసపురం పంచాయతీకి చెందిన సురేష్ బైక్‌పై సాయినగర్‌లోని సర్పంచ్ ఇంటికి వచ్చాడు. రోడ్డుపై బైక్ ఆపి దూషణలు చేస్తూ.. రాళ్లు తీసుకుని ఇంటిపై వేశాడు. పట్టపగలే సురేష్ చేస్తున్న దౌర్జన్యాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. వారిని చంపుతామని బెదిరించాడు. సర్పంచ్ రమణ ఫోన్ ద్వారా తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ తమీమ్ అహ్మద్, ఎస్ఐ షేక్‌షావలి సిబ్బందితో వచ్చి సురేష్‌ను అరెస్ట్ చేశారు. సురేష్ రాళ్ల దాడికి సంబంధించి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. రమణ ఫిర్యాదుపై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడులు చేసినా... ధైర్యంగా ప్రజాసేవ చేద్దాం



తిరుపతి రూరల్ మండల వైఎస్ఆర్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

'రాష్ట్రంలో ప్రభుత్వం మారింది.. ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందించినా ప్రజలు మార్పు కోరుకున్నారు.. జగనన్న నాయకత్వంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన వారుగా ప్రజల పక్షాన పోరాడుదాం.. మనల్ని భయపెట్టాలని చూస్తారు.. అయినా బాధ్యతతో ప్రజా సేవ చేద్దాం.. అధికార పార్టీ దాడులను ప్రజలకు వివరిద్దాం.. స్థానిక సంస్థల్లో అధికారాన్ని కొనసాగిస్తూనే ప్రతిపక్ష పాత్రలో ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేద్దాం.. మీకు అండగా నేనుంటాను. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాను' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు.

– తిరుపతి రూరల్

- అధికార పార్టీ దాడులను ప్రజలకు వివరిద్దాం
- ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుదాం
- ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ప్రజలు అధికారం అప్పగించారన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నందున వైఎస్ఆర్ సీపీ ప్రతిపక్షంలోకి వచ్చిందని, ప్రజలు ఇచ్చిన స్థానిక సంస్థల అధికారాలను మాత్రం బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్ఆర్ సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను వివరిస్తూ ప్రజా ప్రతినిధులందరికీ కూడా బెదిరింపులు వస్తాయని, అయితే దానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ తోడుగా ఉంటానని, ఎవ్వరికి ఏ అవసరం వచ్చినా అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ స్థానిక సంస్థల గౌరవాన్ని కాపాడుతూ ప్రజలకు మంచి చేయడానికి ప్రయత్నించాలని విన్నవించారు. అంతకు ముందు చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల్లో వైఎస్ఆర్ సీపీ నాయకులపై జరిగిన దాడుల గురించి సమగ్రంగా వివరించారు. గ్రామ పంచాయతీలలో అధికార టీడీపీ కార్యకర్తలు వైఎస్ఆర్ సీపీ వారిపై దాడులు చేస్తే ఐక్యంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధులు కావాలన్నారు. ఈ సమావేశానికి వైఎస్ఆర్ సీపీ మద్దతుతో గెలిచిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పెద్ద ఎత్తున తరలిరావడంతో అందరికీ ఆత్మీయ విందు భోజనం ఏర్పాటు చేశారు.

శ్రీనివాస సేతుపై నిబంధనలు పాటించాలి



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శ్రీనివాస సేతుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ బస్సులకు సంబంధించి వంతెనపై వేగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. కొందరు ఆర్టీసీ డ్రైవర్లు వంతెనపై బస్సును ఉంచడాన్ని తప్పుబట్టారు. మరికొందరు కండక్టర్లు వంతెనపై బస్సును నిలిపి, టిక్కెట్ కొట్టడం ప్రమాదకరమని హెచ్చరించారు. కొందరు కొంత దూరమే కదా అంటూ ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎదురుగా బస్సులను నడుపుతున్నారని మండిపడ్డారు. ఇంకొందరు వంతెనపై లోడింగ్, అన్‌లోడింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. వంతెన పైనుంచి బస్టాండ్‌లోకి వచ్చే మార్గంలో ర్యాంప్(డౌన్)వద్ద ఆర్టీసీ సర్వీసులు వేగంగా రావడం సరికాదని చెప్పారు. శ్రీనివాస సేతుపై వేగాన్ని తగ్గించాలని ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంతెనపై వాహనాల తాకిడి తక్కువగా ఉందనే ఉద్దేశంతో పలువురు స్పీడ్ పెంచుతున్నారని... దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన వివరించారు. వంతెనపై ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓ క్రమ పద్ధతిలో వెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రోడ్డు పక్కన కాలువల సర్వేకు చర్యలు



సమావేశం నిర్వహిస్తున్న తహశీల్దార్ మారుతి

చంద్రగిరి: భారీ వర్షాల కారణంగా వరదల సమయంలో ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువలకు సంబంధించి సర్వే పనులను చేపట్టాలని తహశీల్దార్ మారుతి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన సిబ్బందితో కలసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం నుంచి చంద్రగిరి వరకు కాలువ ఉన్నట్లు గుర్తించామన్నారు. గతంలో ఆరు లైన్ల రహదారి నిర్మాణంలో అక్కడక్కడ కాలువలు కనుమరుగయ్యాయన్నారు. దీంతో జాతీయ రహదారి అధికారులు 3ఏ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు రహదారికి సంబంధించి మండల పరిధిలో సచివాలయ సర్వేయర్ల ద్వారా సర్వే నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సర్వే పూర్తి చేసిన తర్వాత కాలువలపై అక్రమ కట్టడాలను నిర్మించినట్లు గుర్తిస్తే, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. చట్టపరంగా నోటీసులు జారీ చేసి వారిపై చర్యలు తీసుకుని, కాలువలను పునరుద్ధరించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఈ మేరకు మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంతో పాటు అన్ని ఆర్‌బీకే సెంటర్లలో లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ రోజు విద్యుత్, ఇంటర్‌నెట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాల్సి ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: క్యాన్సర్పై ప్రజల్లో అవగాహన కలిగించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి సూచించారు తిరుపతి రుయా చిన్న పిల్లల విభాగంలో సోమవారం జిల్లా సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ వైద్యులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో వారి విధులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలపై ప్రజల్లో పూర్తి స్థాయి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ వైద్యులదే అన్నారు. క్యాన్సర్ బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య పరీక్షలు, వైద్యాన్ని చేయించే బాధ్యతలను తీసుకోవాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రోజా రమణి, డాక్టర్ చండీప్రియ, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

మేఘమాల.. ఆనంద హేల



తిరునగరిపై మేఘమాల దోబూచులాడింది. బంగారు వర్ణంతో బయటకొచ్చిన భానుడి లేలేత కిరణాల నడుమ ఉదయం మేఘవర్ణం ఆహ్లాదాన్నిచ్చింది. మిట్ట మధ్యాహ్నం అంబరాన్ని కమ్మేసిన కరి మబ్బులు, సాయం సంధ్య వేళ రంగులు మారుతూ మబ్బులు చూపరులను ఆకట్టుకున్నాయి. సోమవారం కమ్ముకున్న మేఘాలు అప్పడప్పుడూ చిరుజల్లులు చిలకరించాయి. తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని సహజశిల గరుడపై నీలిమేఘాల మాల కనువిందు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

తపాలా బీమా.. కుటుంబానికి ధీమా



గ్రామీణ ఖాతాదారుల సంక్షేమం కోసం తపాలా శాఖ సరికొత్త బీమా పాలసీని తీసుకొచ్చింది. ఏడాదికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తోంది. ప్రీమియం చెల్లించిన రాత్రి 12 గంటల నుంచి ఏడాదిలోపు ప్రమాదంలో మరణించినా.. శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం కలిగినా, పక్షవాతం సంభవించినా బీమా అందజేస్తుంది. అలాగే అర్హులైన వారికి ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు సైతం ఆసరాగా నిలుస్తోంది. అలాగే ఏడాదికి రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. గత రెండేళ్లుగా రూ.399కే రూ.10 లక్షలు బీమా వర్తించేలా ఉండగా.. ప్రస్తుతం అందులో కొన్ని మార్పులు చేశారు. ఇందుకు 18 నుంచి 65 ఏళ్లలోపు ఉన్న ఖాతాదారులు మాత్రమే అర్హులు.


– తిరుపతి (అలిపిరి)

- రూ.399తో రూ.5 లక్షల వరకు ప్రయోజనం
- రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షలు
- ఖాతాదారులకు మాత్రమే అవకాశం
- పాలసీ పొందిన రోజు రాత్రి 12 నుంచే వర్తింపు
- 18–65 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు
- గ్రామీణులకు అందుబాటులో సేవలు

తపాలా శాఖ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ, బజాజ్ అలియాంజ్, నివా బూపా వారి సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.399, రూ.699 ప్రీమియంలతోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాలసీలో ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.399 పాలసీ అయితే రూ.5 లక్షల బీమా కవరేజ్ వర్తిస్తుంది. రూ.699 పాలసీ అయితే రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గత రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టింది. ఇప్పటికే తిరుపతిలో జిల్లాలో మాత్రమే సుమారు 5 వేల మంది వరకు పాలసీని తీసుకున్నారు.

బీమా పొందడం ఇలా..

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీలను రూ.399, రూ.699 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి బీమా వర్తించదు. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా.. పక్షవాతం వచ్చినా బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే బీమా రక్షణ ప్రారంభమవుతుంది. పాలసీదారులకు బాండును వెంటనే అందిస్తారు.



ఇవీ ప్రయోజనాలు

- ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.399 పాలసీదారులకు రూ.5 లక్షలు బీమా వర్తిస్తుంది.
- రూ.699 పాలసీదారులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది.
- శాశ్వత వైకల్యం కలిగితే వారికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.5 నుంచి రూ.10 లక్షలు వర్తిస్తుంది.
- పక్షవాతం సంభవిస్తే రూ.10 లక్షలు
- విద్యా ప్రయోజనం పదిశాతం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరి పిల్లలకు) రూ.50 వేలు వర్తిస్తుంది.
- ఆసుపత్రిలో పదిరోజుల వరకు ఉంటే రోజుకు రూ.1000 చొప్పున అందిస్తారు.
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు.
- యాక్సిడెంట్ మెడికల్ ఖర్చులు ఇన్‌పేషెంట్లకు రూ.60 వేల వరకు అందిస్తుంది.
- కోమా సంరక్షణ కింద రూ.50 వేలు అందిస్తుంది.
- ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో చేరితే రూ.50,000 చెల్లిస్తుంది.
- అలాగే డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా పొందే అవకాశం.

కుటుంబానికి భరోసా



తపాలా పాలసీలు అందరికీ ఉపయోగకరంగా ఉన్నాయి. ఏడాదికి రూ.399, రూ.699 చెల్లిస్తే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రమాద బీమాతో పాటు ఇతర ఉపయోగాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల విద్యాభివృద్ధికి.. ఆసుపత్రి ఖర్చులకు సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి. ఇప్పటికే జిల్లాలో సుమారు 5 వేల మంది వకు ఈ పాలసీలను చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు సైతం పాలసీలు పొందేలా తపాలా రూపొందించింది. గ్రామాల్లో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి కుటుంబానికి ఆసరా నిలిచే ఈ పాలసీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– జేఎం వసంత, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తిరుపతి జిల్లా

ఎమ్మెల్యే ఆరణికి మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నేత ఎస్.మహబూబ్ బాషా

తిరుపతి కల్చరల్: అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహకుడు ఎస్.మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. టీడీపీ మైనారిటీ విభాగం నేతలు మహ్మద్ రఫీ, ఎస్.నూరుల్లా, హర్షద్, జమామ్‌భాయ్, రెహమాన్, అబ్దుల్, నజీరుద్దీన్, అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

చంద్రగిరి: వైకుంఠపురం ఎస్టీ కాలనీలో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వైకుంఠపురం ఎస్టీ కాలనీలో సురేష్ తన కుటుంబ సభ్యులతో కలసి నివశిస్తున్నారు. ఆదివారం రాత్రి తన నివాసం పక్కనే ఉన్న తన పూరింటిలో ఒక్కసారిగా మంటల వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో బాధితులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చే సమయానికి పూరింటిలోని రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో సామాన్లు కాలిబూడదయ్యాయి. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పూరిల్లు దగ్ధంకు సంబంధించి ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక ఎవరైనా నిప్పంటించారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామి కి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బీసీ నాయకుడు కల్లూరి నాగరాజు గౌడ్

తిరుపతి కల్చరల్: బీసీల మద్దతుతో ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయం సాధించిన నేపథ్యంలో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చి బీసీల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లాలోని కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి విజయంలో భాగస్వామ్యులయ్యారని గుర్తు చేశారు. బీసీల మద్దతుతో అధికారం చేజిక్కించుకున్న ఎన్‌డీఏ కూటమి బీసీ అభ్యర్థులకు అధిక శాతం మంత్రి పదవులు కేటాయించడంతో బీసీల సమస్యల పరిష్కారం, బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతలు సోమశేఖర్ ఆచారి, మధు ఆచారి, టి.మునిశేఖర్ గౌడ్, వివేక్, కిరణ్, మహిళా అధ్యక్షురాలు యశోద, మహేష్, జగదీష్, మురళి, రామ్మూర్తి, రామ్‌కుమార్ నాడార్ పాల్గొన్నారు.